సాక్షి నంద్యాల

బుధవారం । 22 । జనవరి । 2025




మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై మంగళవారం వనపర్తికి చెందిన అభినయ కల్చరల్ అకాడమీ వారు ప్రదర్శించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



రక్తహీనత..మాతృవేదన!

మహిళల్లో సరైన పోషకాహారం లేకపోవడంతో రక్తహీనత బారిన పడుతున్నారు. గర్భిణుల్లో సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ప్రసవ సమయంలో పలువురు మృత్యువు బారిన పడుతున్నారు. - 8లో..



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

రూ.2 లక్షల విరాళాలు



విరాళాలు అందించిన దాతలతో ఆలయ అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు మంగళవారం సికింద్రాబాద్‌కు చెందిన స్వరాజ్యలక్ష్మి రూ.1,00,101 విరాళాన్ని పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. అలాగే దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణనిధి పథకానికి సికింద్రాబాద్‌కు చెందిన ఎస్.సూర్యరావు రూ.1,00,101 విరాళాన్ని అందించారు. దాతలకు దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికలను అందజేసి ఆలయ అధికారులు సత్కరించారు.

రెండో రోజూ రైతుల నిరసన

నంద్యాల(అర్బన్): వేరుశనగ లాట్లకు సంబంధించిన అడ్వాన్స్ చెక్కులు ఇవ్వాలంటూ స్థానిక ఎన్ఎస్‌సీ(నేషనల్ సీడ్ కార్పొరేషన్ ఎదుట) పలు గ్రామాల రైతులు చేపట్టిన నిరసన కార్యక్రమం మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా రైతులు నెహ్రూరెడ్డి, తిరుపంరెడ్డి, వెంకటరెడ్డి, రంగస్వామిరెడ్డిలు మాట్లాడుతూ.. చెక్కులు ఇచ్చేంత వరకు ఉద్యోగులు విధులు నిర్వహించకుండా చేస్తామన్నారు. రెండు నెలలుగా చెక్కులు ఇవ్వకపోవడంతో పంట సాగు కోసం తెచ్చిన అప్పులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. చెక్కులు ఇవ్వకపోతే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. జిల్లా అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు.

మార్చి నెలాఖరు వరకు నీరు



పంట కాల్వను పరిశీలిస్తున్న ఎస్ఈ

చాగలమర్రి:తెలుగు గంగ ప్రధాన కాల్వకు మార్చి 31వ తేదీ వరకు విడతల వారీగా సాగునీరు విడుదల చేస్తామని తెలుగు గంగ ఎస్ఈ శివప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని 25, 29 బ్లాకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీరు వృథా కాకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తెలుగు గంగ ప్రధాన కాలువ మరమ్మతులు, లైనింగ్ పనులను గుర్తించామని ప్రతిపాదనలు తయారు చేసి నివేదికను ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఆయన వెంట ఈఈ శివశంకర్‌రెడ్డి, డీఈలు గురుమూర్తి, అనిల్ కుమార్‌రెడ్డి, రత్నరాజు, వెంకటరమణ, ఏఈలు మోహన్ కృష్ణారెడ్డి, వినయ్ కుమార్, నాయక్ తదితరులు ఉన్నారు.

మాతాశిశు మరణాలను అరికట్టాలి

గోస్పాడు: జిల్లాలో మాతాశిశు మరణాలను అరికట్టాలని వైద్య సిబ్బందిని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, నంద్యాల ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ మల్లేశ్వరి ఆదేశించారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని ఎంసీహెచ్ బ్లాక్‌లో మాతృ మరణాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కౌమార దశలో వివాహాలు జరగకుండా చూడాలన్నారు. బిడ్డ ఆరోగ్యం కాపాడాలంటే సకాలంలో వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. జగజ్జననీ నగర్ యూపీహెచ్‌సీ, కొలిమిగుండ్ల పీహెచ్‌సీ పరిధిలో జరిగిన మాతృమరణాలు, మద్దూరు, గాజులపల్లె, గోస్పాడు పీహెచ్‌సీల పరిధిలో జరిగిన శిశు మరణాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ సుదర్శన్‌బాబు, గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ పద్మజ, చిన్నపిల్లల డాక్టర్ లలిత, ఎంసీహెచ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసన్నలక్ష్మి, వైద్యులు అరుణజ్యోతి, శ్రీజ, శ్రీదేవి, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కందుల కొనుగోలుకు 53 కేంద్రాలు

నంద్యాల(అర్బన్): కందులు కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్ సిద్ధమైంది. వ్యవసాయ శాఖ ఇచ్చిన జిల్లా సగటు దిగుబడిలో 25 శాతం ప్రకారం నాఫెడ్ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ బుధవారం నుంచి కందులు కొనుగోలు చేయనుంది. మండలానికి ఒకటి చొప్పున కర్నూలు జిల్లాలో 25 , నంద్యాలలో 28 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఉమ్మడి జిల్లాలో 877 రైతు భరోసా కేంద్రాలు ఉండగా.. ప్రతి ఆర్‌బీకేను ఒక కొనుగోలు కేంద్రంగా ఏర్పాటు చేశారు. దీంతో రైతులు ఎలాంటి వ్యయ ప్రయాసలు లేకుండా ఎక్కడికక్కడ మద్దతు ధరతో అమ్ముకునే అవకాశం కల్పించారు. కూటమి ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా మొత్తానికి 53 కొనుగోలు కేంద్రాలు మాత్రమే ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో 9 వేల టన్నులు, నంద్యాల జిల్లాలో 8 వేల టన్నుల ప్రకారం కొనుగోలుకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే మార్క్‌ఫెడ్ దగ్గర తగినన్ని గన్నీ బ్యాగులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

"ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు రూ.2 లక్షలు, రూ.5 లక్షలు లంచాలు తీసుకుని డీలర్‌షిప్‌లు, ఇతరత్రా పోస్టులు ఇప్పిస్తున్నారు. టీడీపీ కార్యకర్తలతోనే లంచాలు తీసుకుంటున్నారు. ఎంపీ చెప్పిన సిఫార్సు కంటే లంచాలు ఇచ్చిన వారికే పోస్టులు ఇస్తున్నారు. లంచాల తతంగాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళతా! లేదంటే టీడీపీని మోసం చేసిన వాడినవుతా!"

– ఈ నెల 18న టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి చేసిన వ్యాఖ్యలు.



ఆయన వ్యాఖ్యలు చూస్తే ప్రభుత్వ పాలన ఎంత అధ్వానంగా ఉందో, లంచాల పేరుతో టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు ఏ స్థాయిలో దండుకుంటున్నారో ఇట్టే తెలుస్తోంది. కర్నూలు జిల్లాలోనే కాదు, నంద్యాల జిల్లాలోనూ ఇదే స్థాయి అవినీతి దందా నడుస్తోంది! కర్నూలు అధ్యక్షుడు బాహాటంగానే ఆరోపణలు చేశారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడు చేయలేదు. అంతే తేడా!



లంచాల పాలన!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూటమి ఎమ్మెల్యేల విచ్చలవిడి అవినీతి

- నామినేటెడ్ పోస్టుల నుంచి కాంట్రాక్టు పనుల వరకూ చేతులు తడిపితేనే గ్రీన్‌సిగ్నల్
- నేతలు పదవులు అమ్ముకుంటున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి సంచలన ఆరోపణలు
- చంద్రబాబుకు ఫిర్యాదు చేసేందుకు ఆధారాలతో చిట్టా సిద్ధం చేస్తున్న వైనం
- దావోస్ నుంచి ముఖ్యమంత్రి రాగానే ఆధారాలతో సహా ఫిర్యాదు

సాక్షిప్రతినిధి కర్నూలు: ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో లంచాల పాలన నడుస్తోంది. ఇసుక, మద్యం వ్యాపారం మొదలు నామినేటెడ్ పోస్టులు.. కాంట్రాక్టు పనులు.. ఏదీ చేయాలన్నా తమ్ముళ్లను కలవాల్సిందే.. కప్పం కట్టాల్సిందే. గత సార్వత్రిక పోరులో ఉమ్మడి జిల్లాలో కూటమి అభ్యర్థులు 12 అసెంబ్లీలు, 2 పార్లమెంట్ స్థానాల్లో గెలుపొందారు. ఉమ్మడి జిల్లా చరిత్రలో ఈ స్థాయి ఫలితాలు టీడీపీ చూడటం ఇదే తొలిసారి. ఊహించని ఫలితాలతో అధికారం చేపట్టిన కూటమి ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు అధికారంలోకి వచ్చిన తర్వాత అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని ఆర్థికంగా ఎదిగేందుకే రెండు చేతులా ఒడిసిపట్టుకుంటున్నారు. అక్రమంగా ఇసుకను తవ్వి తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు సరఫరా చేస్తూ భారీగా దండుకుంటున్నారు. మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో ఇసుక దందా విచ్చలవిడిగా నడుస్తోంది. హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారి పక్కనే తుంగభద్ర నదిలో మునగాలపాడు సమీపంలో జేసీబీలతో నదిలో తవ్వి రాత్రిళ్లు హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఇక్కడి టీడీపీ కీలక నేత ఆధ్వర్యంలోనే ఇసుక దందా సాగుతోంది. మంత్రాలయంలో కూడా ఇదే తంతు నడుస్తోంది. అలాగే అన్ని నియోజకవర్గాల్లో రేషన్ బియ్యం దందా నడుస్తోంది. ఈ దందా సాగించే నేతలు పలు నియోజకవర్గాల్లోని కీలక నేతలకు నెల మామూళ్లు నిర్దేశించి యథేచ్ఛగా అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఇలా ప్రతీ అంశంలో ఆదాయమార్గాన్ని చూసుకుంటున్న టీడీపీ నేతలు చివరకు నామినేటెడ్ పోస్టుల నుంచి కాంట్రాక్టుల వరకు ప్రతీ అంశంలో లంచం ఇస్తేనే పని చేస్తున్నారు. పైగా నామినేటెడ్ పోస్టులు టీడీపీ శ్రేణులకే ఇవ్వాలి. ఎమ్మెల్యేలు, పార్టీ గెలుపునకు కృషి చేస్తే తమతోనే పోస్టును బట్టి రేటు ఫిక్స్ చేయడంపై ఆపార్టీ ద్వితీయశ్రేణి నాయకత్వం రగిలిపోతుంది. ఈ అంశాలను పార్టీ దృష్టికి తీసుకెళుతున్నారు. అందులో భాగంగానే తిక్కారెడ్డికి పూర్తి విషయాలు తెలిసి ఏకంగా పార్టీ కార్యకర్తల సమక్షంలోనే ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు లంచాలకు పదవులు అమ్ముకుంటున్నారని ఆరోపణలు చేశారు. ఒక పార్టీ అధ్యక్షుడే నేరుగా ఆరోపణలు చేశారంటే కర్నూలు జిల్లాలో అవినీతి కంపు ఏస్థాయిలో ఉందో సుస్పష్టమవుతోంది.

కమీషన్ మాట్లాడుకోవాల్సిందే..

ఇసుక దందాను పక్కనపెడితే అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వంలోని పనులు టీడీపీ ఎమ్మెల్యేలు అర్ధంతరంగా నిలిపేశారు. కాంట్రాక్టర్లు వచ్చి ఎమ్మెల్యేలను కలిసి కమిషన్ మాట్లాడుకుని ఆపై పనులు చేసుకోవాలని హుకుం జారీ చేశారు. నంద్యాలలో మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జనవికాస్ కార్యక్రమ్(పీఎంజేకే) ద్వారా హాస్టల్, స్కూలు భవనాలతో పాటు 6 మేజర్ పనులు రూ.14కోట్లతో జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో 60శాతం పనులు పూర్తయ్యాయి. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు నిలిపేశారు. వచ్చి మంత్రితో మాట్లాడిన తర్వాతే పనులు మొదలు పెట్టాలని మంత్రి అనుచరులు కాంట్రాక్టర్‌కు చెప్పారు. ఏకంగా మంత్రి ఇలాఖాలో జరిగిన తంతు ఇది!

ఎమ్మిగనూరు, ఆలూరు, కోడుమూరు, ఆదోని నేతలపై అధిక ఫిర్యాదులు

ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథిపై ఎక్కువ ఆరోపణలు వస్తున్నాయి. అక్కడి ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల యజమానులను డబ్బుల కోసం బెదిరించినట్లు బీజేపీ నేతలే ఆపార్టీ అధిష్టానానికి, ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. మార్కెట్‌యార్డు అధికారులను కూడా వేధింపులకు గురిచేసినట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. కోడుమూరు నియోజకవర్గం పంచలింగాలలో ఎంపీ బస్తిపాటి నాగరాజు ఓ పోస్టును సిఫార్సు చేస్తే, అక్కడి ఎమ్మెల్యే దస్తగిరి, ఇన్‌చార్జ్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఎంపీ సిఫార్సును పక్కనపెట్టి తాము సిఫార్సు చేసిన వారికే పోస్టు ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశాన్ని కూడా పరోక్షంగా తిక్కారెడ్డి లేవనెత్తి విమర్శించారు. ఎంపీ చెప్పిన వారికి కాకుండా లంచాలు ఇచ్చిన వారికి పోస్టులు ఇస్తారా? అని ఆయన ప్రశ్నించారు. ఆలూరు ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం ఇన్‌చార్జ్ రాఘవేంద్రరెడ్డిలపై కూడా టీడీపీ అధ్యక్షుడికి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల వారీగా ఏ నేత ఎవరిని ఎంత మొత్తంలో లంచాలు వసూలు చేశారని తిక్కారెడ్డి పూర్తి ఆధారాలతో చిట్టా సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన నుంచి రాగానే ఆయనను కలిసి అవినీతి చిట్టాను వివరించనున్నారు.

- దేవనకొండ మండలంలో సింగిల్‌విండో చైర్మన్ పదవిని రూ.22 లక్షలకు ఆలూరు నియోజకవర్గంలోని టీడీపీ కీలక నేత ఒకరు బేరం కుదుర్చుకున్నట్లు తెలిసింది.
- మంత్రాలయం నియోజకవర్గం కోసిగి సింగిల్ విండో పదవిని రూ.15 లక్షలకు అక్కడి టీడీపీ కీలక నేత బేరం పెట్టారు. మొన్నటి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన వ్యక్తికి ఈ పోస్టును కట్టబెట్టేందుకు ఫైల్ కదిలినట్లు తెలుస్తోంది.
- ఆలూరు నియోజకవర్గం తెర్నేకల్‌లో సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి 5శాతం కమీషన్ ఇవ్వాలని ఆ నియోజకవర్గంలోని టీడీపీ కీలక నేత కాంట్రాక్టర్లకు హుకూం జారీ చేశారు. ఆలూరులోనే కాదు ఉమ్మడి జిల్లాలో ఉపాధిహామీ పథకం నిధులతో చేపడుతున్న సిమెంట్‌రోడ్లు అన్నింటిలో కమిషన్ల దందా నడుస్తోంది.
- ఆళ్లగడ్డ మునిసిపాలిటీలో 22 మంది పారిశుధ్యకార్మికులను నియమించేందుకు అక్కడి ఎమ్మెల్యే అనుచరులు ఇద్దరు ఒక్కొక్కరి నుంచి రూ.2లక్షలు చొప్పున రూ.44 లక్షలు వసూలు చేశారు.
- డోన్‌లో హంద్రీ-నీవా నుంచి చెరువులను నింపేందుకు రూ.320 కోట్లతో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. మైనర్ వర్క్స్ చేస్తున్న ఏజెన్సీని నిలిపేసి తమ నాయకుడిని కలవాలని టీడీపీ కీలక నేత అనుచరులు హుకూం జారీ చేశారు. ఈ నియోజకవర్గంలోని అవినీతిపై ధర్మవరం సుబ్బారెడ్డి టీడీపీ అధిష్టానానికి కూడా ఫిర్యాదు చేశారు.
- ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని రూ.30 లక్షలకు బేరం పెట్టారు. ఇతను కూడా వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన వ్యక్తి!

కష్టాలు.. కన్నీళ్లు!

170 కి.మీ దూరం వెళ్తూ..



ఈ చిన్నారి పేరు మహాలక్ష్మి. కూలీ పనిచేసి జీవనం చేసే నూనెపల్లెకు చెందిన మరియమ్మ, రాజేష్‌ల పెద్ద కుమార్తె. పుట్టుకతోనే దివ్యాంగురాలు. చిన్నతనంలోనే అధికారులు దివ్యాంగురాలిగా (మెంటలీ రిటార్డేషన్) గుర్తించి పింఛన్‌ను మంజూరు చేశారు. ఏ పని చేయలేని ఈ చిన్నారిని బయటకు తీసుకొని వెళ్లాలంటే ఇంకో మనిషి అవసరం ఉంటుంది. సోమవారం రాత్రి మహాలక్ష్మికి ఆరోగ్య పరీక్షలు చేయాలంటూ ఆదోనికి తీసుకొని వెళ్లాలని సచివాలయ సిబ్బంది చెప్పడంతో తల్లిదండ్రులకు దిక్కుతోచలేదు. దాదాపు 170 కి.మీ దూరంలో ఉన్న ఆదోనికి బయల్దేరుతుండగా చిన్నారి కిందపడి అనారోగ్యానికి గురి కావడంతో అవస్థలు పడుతున్నామని వారు కన్నీటిపర్యంతమయ్యారు.

అయ్యో.. పాపం



కర్నూలు నగరానికి చెందిన గౌసియా ఫాతిమా(11) పుట్టుకతోనే మానసిక వికలాంగురాలు. బాలిక వైకల్యాన్ని పరీక్షించిన వైద్యులు గతంలో వికలాంగుల ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రావాలని చెప్పడంతో తల్లిదండ్రులు ఆ పాపను అష్టకష్టాలు పడి ఆటోలో తీసుకొచ్చారు. గంటకు పైగా శిబిరం వద్ద వేచి ఉండాల్సి రావడంతో ఆ పాప తెలిసీ తెలియక చేసే ఇబ్బందులను తట్టుకుంటూ తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు చెప్పనలవి కాదు.

రూ. 5 వేలు ఖర్చు



నంద్యాల పట్టణానికి చెందిన ఈ బాబు పేరు మదార్ వలి. వైద్య పరీక్షలు చేయించుకోవాలని సచివాలయ ఉద్యోగులు చెప్పడంతో బాలుడి తల్లిదండ్రులు ఉదయాన్నే ప్రత్యేకంగా ఆటో తీసుకున్నారు. పిల్లలతో కలిసి మొత్తం ఐదుగురు అందులో ఆదోనికి వచ్చారు. ఇందుకు రూ.5 వేలకు పైగానే ఖర్చు వచ్చింది. " ప్రభుత్వం ఇలాంటి పిల్లల పట్ల సానుకూలంగా స్పందించాలని, బుద్ధి మాంద్యం అనగానే ఎలాంటి పరీక్షలు లేకుండా చూడాలని" బాలుడి తండ్రి అహ్మద్ బాషా అన్నారు.



బిడ్డను ఎత్తుకుని వైద్య పరీక్షల కోసం నిల్చున్న ఈమె పేరు శారద. నంద్యాల నుంచి చాలా ఇబ్బందులు పడుతూ ఆదోని వైద్య శిబిరానికి వచ్చారు. వైద్య పరీక్షలు చేయించుకున్న తర్వాత.." ఇన్ని కష్టాలు ఎందుకో, చిన్నారిని ఆదోని తీసుకొచ్చేందుకు కష్టాలు పడ్డాం" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన సదరం క్యాంపునకు హాజరైన దివ్యాంగులు



ఆదోని సదరం క్యాంపు వద్ద కంటి పరీక్షల కోసం వేచి ఉన్న మహిళలు



నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక క్యాంపు వద్దకు వచ్చిన దివ్యాంగులు

- సర్టిఫికెట్ల పరిశీలనతో దివ్యాంగులకు తప్పని తిప్పలు
- మళ్లీ పరీక్షలెందుకంటూ నిట్టూర్పు

కర్నూలు(హాస్పిటల్)/ఆదోని టౌన్/గోస్పాడు: వైకల్యానికి సంబంధించి గతంలో జారీ చేసిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మంగళవారం ప్రారంభమైంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని సదరం క్యాంపులో ఏర్పాటు చేసిన శిబిరానికి 60 మందికి పైగా దివ్యాంగులు హాజరయ్యారు. వినికిడి, మానసిక సమస్యలపై జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు, దివ్యాంగుల వైకల్యాన్ని వైద్యులు పరిశీలించారు. సదరం క్యాంపునకు వచ్చిన వారిలో చాలా మంది నడవలేని పరిస్థితిలో ఉన్నవారే. సహాయకులు ఆపసోపాలు పడి వారిని శిబిరానికి తీసుకువచ్చారు. ఉదయం 9 గంటలకు వచ్చిన వారు రద్దీని బట్టి గంట నుంచి రెండు గంటల సమయం వేచి ఉండి పరీక్ష చేయించుకుని వెళ్లాల్సి వచ్చింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు శిబిరం కొనసాగించారు. వైద్య పరీక్షలు చేసేందుకు అనంతపురం జిల్లా నుంచి ఈఎన్‌టీ, సైకియాట్రీ వైద్యులు కర్నూలుకు వచ్చారు. వీరు వారంలో మంగళ, బుధ, గురువారాల్లో ఓపీ నెం.41(సదరం)లో దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి వారి పత్రాలను పరిశీలిస్తారు.

- ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన సదరం క్యాంపునకు ఆదోనితో పాటు నంద్యాల, కర్నూలు ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు 200 మంది హాజరయ్యారు. మానసిక వికలాంగులు ఆదోనికి రావడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలోనే టీడీపీ ప్రభుత్వ హయాంలోనే తమ పిల్లల సర్టిఫికెట్ల పరిశీలించారని, ఇప్పుడు మళ్లీ వెరిఫికేషన్ పేరుతో వందల కిలోమీటర్లు తిప్పడం ఏమిటంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.
- నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో డీఎంహెచ్ఓ వెంకటరమణ, సూపరింటెండెంట్ మల్లేశ్వరి ఆధ్వర్యంలో దివ్యాంగుల వైద్య పరీక్షల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈనెల 21 నుంచి 23 వరకు దివ్యాంగులకు పరీక్షలు చేస్తారని తెలిపారు. ఉదయం, సాయంత్రం రెండు విడతల్లో మొదటి రోజు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలకు హాజరవుతున్న వారందరూ కూటమి ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు.

సమన్వయలోపం..

దివ్యాంగుల సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌కు సంబంధించి ఏర్పాట్ల విషయంలో రెండు శాఖల మధ్య సమన్వయం లోపించింది. పింఛన్లు ఇచ్చేది డీఆర్‌డీఏ కాబట్టి ఏర్పాట్లు వారే చేయాలని ఆసుపత్రి అధికారులు చెబుతున్నారు. ఆసుపత్రిలోనే సదరం క్యాంపు ఉందని, వైద్యులు, సిబ్బంది ఏర్పాట్లు చేయాలని డీఆర్‌డీఏ శాఖ వారు వాదించుకున్నట్లు సమాచారం. ఎట్టకేలకు ఆసుపత్రి అధికారులే శిబిరానికి అవసరమైన టెంట్లు, కుర్చీలు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు.



పల్లకీలో ఉత్సవమూర్తులు

మర్రిపల్లెకు చేరిన పార్వేట పల్లకీ

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి పార్వేట పల్లకీ మంగళవారం రూరల్ మండలం మర్రిపల్లె గ్రామం చేరుకోవడంతో భక్తులు దర్శించుకున్నారు. గ్రామ తెలుపులపై కొలువైన స్వామి వారికి మొక్కులు చెల్లించారు. గ్రామంలో పండుగ సందడి నెలకొంది.

స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దుదాం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టి జిల్లాను స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ రాజకుమారి పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్, సామూహిక మరుగుదొడ్ల కాంప్లెక్స్‌లు తదితర పారిశుద్ధ్య కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెత్త సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఇందుకు సంబంధించి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు పూర్తిస్థాయి శ్రద్ధ పెట్టి సంపూర్ణ పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. కొత్తపల్లి, శిరివెళ్ల, పాములపాడు, బండిఆత్మకూరు మండలాల్లో క్లోరినేషన్, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు శుభ్ర పరచడం తదితర పారా మీటర్లలో వెనుకబడి ఉన్నారని పనితీరు మెరుగుపరచుకొని ప్రగతి చూపించకపోతే ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టకుండా అంకెల గారడీతో మభ్యపెడితే ఊరుకునేది లేదన్నారు. జిల్లాలో 417 సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి గాను 192 పూర్తి అయ్యాయని, ఇంకా ప్రారంభించని 167, వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలన్నారు. పూర్తయిన సామూహిక మరుగుదొడ్లను తాను స్వయంగా తనిఖీ చేస్తానన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జమీవుల్ల, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు శ్రీశైల మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై సమీక్ష

శ్రీశైలం టెంపుల్: ఫిబ్రవరి 19వ తేది నుంచి మార్చి 1 వరకు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కల్పించాల్సిన సౌకర్యాలపై బుధవారం సమీక్ష సమావేశం జరుగనుంది. దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధ్యక్షత వహిస్తారు. శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, నాగర్‌కర్నూలు జిల్లాలోని అచ్చంపేటకు చెందిన అధికారులు పాల్గొంటారు.

'ఆ సమయంలో డీఎంహెచ్‌ఓగా లేను'

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖలో పలు పోస్టుల భర్తీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినప్పుడు డీఎంహెచ్‌ఓగా తాను లేనని ప్రస్తుత డీఎంహెచ్‌ఓ పి. శాంతికళ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 'వైద్య ఆరోగ్యశాఖ అధికారికి చార్జ్‌మెమో' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆమె వివరణ ఇచ్చారు. గత సంవత్సరం డిసెంబర్ 27వ తేదీన తాను డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించానన్నారు. అయితే ల్యాబ్ టెక్నీషియన్, ఎఫ్ఎన్‌వో, ఎస్ఏడబ్ల్యూ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వమని గత నవంబర్ 25వ తేదీన డైరెక్టర్ ఆఫ్ హెల్త్ నుంచి మెయిల్ వచ్చిందని, అప్పట్లో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా భాస్కర్ ఉన్నారని తెలిపారు. కావున ఈ పోస్టులకు సంబంధించిన చార్జ్ మెమోలకు, తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు.


నేడు ఉచిత వైద్య శిబిరం

నంద్యాల(న్యూటౌన్): గ్రహణ మొర్రి చిన్నారులకు స్క్రీనింగ్‌క్యాంపుతో పాటు ఉచిత వైద్య శిబిరం బుధవారం నంద్యాల మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ప్రేమంతకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న వారికి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేస్తారని పేర్కొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌లో ఇద్దరు సాక్షుల అరెస్ట్

ఆదోని అర్బన్: నకిలీ ఫ్యామిలీ సర్టిఫికెట్ సృష్టించి భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న ఉదంతంలో ఇద్దరు సాక్షులను ఆదోని టూటౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు తెలిపిన వివరాల మేరకు..బతికున్న హెగ్గటి ఈశ్వరప్ప మృతిచెందాడని నకిలీ డెత్, ఫ్యామిలీ సర్టిఫికెట్‌తో గత నెల 31వ తేదీన ఆముదాల భాస్కర్ అనే వ్యక్తి చాకలి ఈరన్నకు భూమి రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. ఈ వ్యవహారంపై పది మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటికి ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. సాక్షులైన ఈరన్న, లోకనాథరెడ్డిలను మంగళవారం అరెస్టు చేసి కటకటాలకు పంపారు. సబ్‌రిజిస్ట్రార్ అజీమియా, భూమిని రిజిస్టర్ చేయించుకున్న చాకలి ఈరన్నను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టామని సీఐ తెలిపారు.

- ప్రసవ సమయంలో రక్తం తక్కువై మాతృమరణాలు
- రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు
- జిల్లాలో 70 శాతం మందికి పైగా రక్తహీనత
- 20 శాతం మందికి తీవ్ర రక్తహీనత
- పోషకాహారం ఇస్తున్నా కనిపించని ఫలితం
- క్షేత్రస్థాయిలో మరింత అవగాహన అవసరమంటున్న వైద్యులు



రక్తహీనత..మాతృవేదన!

సృష్టిలో ప్రతి ప్రాణి జీవించాలంటే శరీరంలో రక్త సరఫరా చాలా ప్రధానం. ముఖ్యంగా కౌమారదశలోకి చేరిన బాలికలు రజస్వల దాల్చిన తర్వాత వారిలో రక్తస్రావం కారణంగా రక్తహీనత క్రమంగా పెరుగుతూ పోతుంది. ఈ సమయంలో వారు సరైన పోషకాహారం తీసుకోకపోతే వివాహమైన తర్వాత తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుంది. అదృష్టం బాగుంటే కొందరు కాన్పు సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా పునర్జన్మ ఎత్తుతారు. లేకపోతే రక్తం తక్కువై ప్రాణాలు కోల్పోతారు. జిల్లాలో ప్రస్తుతం ఈ పరిస్థితి నెలకొన్నా ప్రభుత్వాలు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాయి.

కర్నూలు(హాస్పిటల్):కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్రసూతి విభాగానికి ప్రతిరోజూ 25 నుంచి 30 మంది దాకా ప్రసవానికి వస్తుంటారు. వీరితో పాటు గర్భం దాల్చిన వారు రెగ్యులర్ చెకప్ కోసం మరో 250 మందికి పైగా వస్తుంటారు. వీరిలో 60 నుంచి 70 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. వీరిలో చికిత్స కోసం వచ్చిన వారికి అవసరమైన మందులు సూచించి, పోషకాహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. ప్రసవం కోసం వచ్చిన వారికి మాత్రం రక్తం తక్కువైతే అప్పటికప్పుడు బ్లడ్ బ్యాంకులో అవసరమైన రక్తాన్ని తెప్పించి ఎక్కించి ప్రసవం చేస్తుంటారు. తీవ్ర రక్తస్రావంతో ప్రసవానికి వచ్చిన కొందరు కోలుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారు. కర్నూలుతో పాటు నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు, ఆదోని మాతాశిశు ఆసుపత్రికి ప్రతి నెలా ప్రాణాపాయ స్థితిలో రక్తహీనత ఉన్న గర్భిణుల కేసులు 40 నుంచి 60 దాకా వస్తుంటాయి. మాతాశిశు మరణాలు తగ్గించేందుకు గాను వైద్యశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, వైద్యవిదాన పరిషత్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా, జిల్లా ఆసుపత్రులు, బోధనాసుపత్రులు, అర్బన్‌హెల్త్ సెంటర్ల పరిధిలో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆశాల నుంచి వైద్యాధికారి వరకు గర్భం దాల్చిన మహిళ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెబుతున్నారు. సాధారణ రక్తహీనత ఉన్న వారికి మాత్రలు, తీవ్ర రక్తహీనత ఉన్న వారికి సుక్రోజ్ ఇంజెక్షన్లు ఇస్తున్నామని లెక్కలు చెబుతున్నా ఇప్పటికీ చాలా మంది గర్భిణులు తీవ్ర రక్తహీనత కన్నుమూయడం ఆందోళన కలిగిస్తోంది.

రక్తహీనత ఉంటే ఇలా చేయాలి

హిమోగ్లోబిన్ శాతం 8 నుంచి 10 గ్రాములు ఉంటే కొంచెం రక్తహీనతగా, 6 నుంచి 8 గ్రాములుంటే మధ్యస్తంగా, 6 కంటే తక్కువగా ఉంటే మాత్రం దానిని వైద్యులు తీవ్రంగా పరిగణిస్తారు. 8 నుంచి 10 శాతం ఉన్న వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, 6 నుంచి 8 గ్రాములు ఉన్న వారు ఐరన్ సుక్రోజ్ ఇన్‌ఫ్యూజన్ ఇంజెక్షన్లు ఇస్తారు. 6 కంటే తక్కువ ఉన్న వారికి మాత్రం రక్తం ఎక్కిస్తారు. గర్భిణికి మూడో నెల గర్భం నుంచి తప్పనిసరిగా ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలు క్రమం తప్పకుండా వాడాలి. లేకపోతే వారు తీవ్ర రక్తహీనతకు చేరి తల్లీ బిడ్డలిద్దరికీ ప్రాణాపాయం సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

70 శాతం మందికి తీవ్ర రక్తహీనత

కర్నూలు జిల్లాలో గత ఏడాది నమోదైన గర్భిణుల్లో 45.36 శాతం మందికి 11 గ్రాములలోపు, కేవలం 3.30 శాతంలోపు మందికే 7 గ్రాముల్లోపు రక్తం ఉన్నట్లు నమోదు చేశారు. కాగా నమోదైన మొత్తం 28,130 మంది గర్భిణుల్లో 93.58 శాతం మందికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కానీ వాస్తవ పరిస్థితులను గమనిస్తే జిల్లా వ్యాప్తంగా నమోదైన 28,130 మంది గర్భిణుల్లో 70 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఒక్క కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనిక్ ఓపీకి వస్తున్న గర్భిణుల్లో 60 నుంచి 70 శాతం మందికి హెచ్‌బీ 10 నుంచి 6 గ్రాముల్లోపు ఉంటోందని వైద్యులు పేర్కొంటున్నారు. గ్రామాల్లోని పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలు, అర్బన్‌హెల్త్ సెంటర్లు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ఐరన్‌మాత్రలు పంపిణీ చేస్తున్నా, మరీ రక్తం తక్కువ ఉన్న వారికి సుక్రోజ్ ఇంజెక్షన్లు ఎక్కిస్తున్నా, అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందజేస్తున్నా రక్తహీనత శాతం ఎందుకు తగ్గడం లేదో అధికారులే సమాధానం చెప్పాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే కోడిగుడ్లు, చిక్కీలు, కందిబ్యాళ్లు, బెల్లం తదితర పోషకాహార పదార్థాలను అధిక శాతం మంది గర్భిణులు ఇళ్లకు తీసుకెళ్లి ఇంటిల్లిపాదికి వాడుకుంటున్నారు. ఈ కారణంగా గర్భిణిలకు సరైన పోషకాహారం అందడం లేదన్నది బహిరంగ రహస్యం. క్షేత్రస్థాయిలో ఈ విషయం గురించి అటు వైద్యాధికారులు, ఇటు ఆశాలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది సరైన అవగాహన కల్పించకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంటోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓపీ విభాగానికి వచ్చిన గర్భిణులు

చుట్టుముట్టుతున్న ఆరోగ్య సమస్యలు

రక్తహీనత కారణంగా గర్భంలో శిశువు ఎదుగుదల సరిగ్గా ఉండక అబార్షన్ అయ్యేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఒక్కోసారి నెలలు నిండకుండానే బిడ్డ జన్మించి మరణించే అవకాశం ఉంది. గర్భిణికి టీబీ, బీపీ వచ్చే అవకాశం ఉంది. బీపీ కారణంగా ఫిట్స్ రావచ్చు, బీపీతో మెదడులో నరాలు చిట్లవచ్చు. కొన్నిసార్లు తల్లి, బిడ్డ మెంటల్‌గా తయారవుతారు. అకస్మాత్తుగా గర్భంలోనే బిడ్డ చనిపోవచ్చు. కొన్నిసార్లు గర్భంలోనే మాయ విడిపోయి కాన్పు కష్టం అవుతుంది. గర్భిణికి మూత్రపిండాలు, కాలేయం దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

డాట్స్ విధానం మాదిరిగా పోషకాహారం ఇవ్వాలి



క్షయ వ్యాధిని నియంత్రించేందుకు ఎలాగైతే ఇంటికి వెళ్లి మందులు ఇచ్చేవారో అలాగే గర్భిణుల్లో రక్తహీనతను తగ్గించేందుకు వారి ఇంటికే వెళ్లి పోషకాహారం తినిపించేలా చర్యలు తీసుకోవాలి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వస్తున్న గర్భిణుల్లో 60 నుంచి 70 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. ముఖ్యంగా ఆదోని, కోసిగి ప్రాంతాలకు చెందిన మహిళల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంటోంది. పోషకాహారంపై అవగాహన లేకపోవడం, జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, సంప్రదాయ ఆహారం తీసుకోకపోవడం ఈ సమస్యకు ప్రధాన కారణం. కొంత మంది గుడ్డు తింటే మంచిది కాదన్న మూఢ నమ్మకంతోనూ గర్భిణులకు వాటిని దూరం చేస్తున్నారు. రక్తహీనత వల్ల కొన్నిసార్లు మాతృ మరణం జరిగే ప్రమాదం ఉంది.

–డాక్టర్ శ్రీలక్ష్మి, గైనకాలజి హెచ్‌ఓడీ, జీజీహెచ్, కర్నూలు

పోలీసు ఉద్యోగ పరీక్షలో దొడ్డిదారి యత్నం!

- నకిలీ హాల్ టికెట్ సృష్టించి దొరికిపోయిన వైనం
- చీటింగ్ కేసు నమోదు చేసి అరెస్టు చేసిన పోలీసులు



పట్టుబడిన తిరుమల

కర్నూలు: ఎలాగైన పోలీసు ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో కొంతకాలంగా సాధన చేసిన ఓ అభ్యర్థి ఛాతీ, ఎత్తు కొలతల్లో ఫెయిల్ కావడంతో దొడ్డిదారిలో యత్నించి అడ్డంగా దొరికిపోయాడు. అధికారులను మోసగించే క్రమంలో అక్కడ సాంకేతికత ద్వారా గుర్తించి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని 4వ పట్టణ పోలీసు స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు చేసి కటకటాల్లోకి పంపారు. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్‌పీ బెటాలియన్‌లో డిసెంబరు 30 నుంచి దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం కోసిగి మండలం దొడ్డి బెళగల్ గ్రామానికి చెందిన పి.నరసింహుడు కుమారుడు పబిత తిరుమల బయోమెట్రిక్‌కు హాజరయ్యాడు. అయితే, అతను ఎత్తు, ఛాతి కొలతల్లో ఫెయిల్ కావడంతో వెనక్కి పంపారు. అయితే క్వాలిఫై అయినట్లుగా హాల్ టికెట్‌ను కలర్ జిరాక్స్ తీసుకొని.. క్వాలిఫై అయినట్లు టిక్ మార్క్ వేసుకొని 1600 మీటర్ల పరుగులో పాల్గొనేందుకు వరుస క్రమంలో నిలబడి మోసగించేందుకు ప్రయత్నించగా...స్టాటింగ్ పాయింట్ బందోబస్తు డ్యూటీలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ నాగభూషణం గుర్తించి అభ్యర్థి మోసాన్ని వెలుగులోకి తెచ్చారు. పాడ్ క్యారియర్ లేకుండా 1600 మీటర్ల పాయింట్ వద్ద ఆర్ఎఫ్ఐడీ రిజిస్ట్రేషన్ కంప్యూటర్ ఆపరేటర్ జయరాం దగ్గరకు వెళ్లి పరిశీలించగా...సిస్టమ్‌లో అభ్యర్థి పేరు చూపడం లేదని, హాల్ టికెట్‌లో మాత్రం క్వాలిఫై అయినట్లుగా నకిలీ తయారు చేసి టిక్ మార్క్ వేసుకున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇదే విషయాన్ని ఎస్పీ బింధుమాదవ్ దృష్టికి తీసుకెళ్లగా.. 4వ పట్టణ పోలీసులకు అప్పగించాలని ఆదేశించారు. ఈ మేరకు అభ్యర్థి పబిత తిరుమలపై చీటింగ్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ గోపీనాథ్ తెలిపారు.కాగా 11 రోజు మంగళవారం పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు మొత్తం 600 మందిని ఆహ్వానించగా... 412 మంది వచ్చారు. వీరిలో ప్రధాన పరీక్షకు మంగళవారం 267 మంది ఎంపికయ్యారు.

ఉరుకుందలో గుర్తు తెలియని వృద్ధుడి మృతి



మృతి చెందిన వృద్ధుడు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనానికి వెళ్లి ఓ గుర్తు తెలియని వృద్ధుడు చనిపోయాడు. స్వామికి తలనీలాలు సమర్పించి కాలువలో స్నానం చేసి బయటకు వస్తుండగా కింద పడి మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 60 ఏళ్ల మధ్యలో ఉంటుంది. అతడొక్కడే దర్శనానికి వచ్చాడు. ఈ మేరకు స్థానికులు కౌతాళం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిస్తే కౌతాళం పోలీస్టేషన్‌కు సంప్రదించాలని ఏఎస్ఐ రమణరెడ్డి కోరారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి




మాట్లాడుతున్న ఆనంద్‌రాజ్‌కుమార్

ఆదోని రూరల్: యువత వ్యాపార రంగంలో నైపుణ్యాలు పెంచుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ సూచించారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నాక్ శిక్షణ కేంద్రంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వ్యాపార నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈడీపీ శిక్షకులు రామాంజనేయులు, రాజశేఖర్, నాక్ సెంటర్ ఇన్‌చార్జ్ బి.జి.ఉలిగన్న పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి..

ఎమ్మిగనూరురూరల్: కుక్క అడ్డు రావడంతో వాహనంపై నుంచి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మండల పరిధిలోని సోగనూరు గ్రామంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...గ్రామానికి చెందిన హరిజన ముక్కరన్న కుమారుడు సప్పాగు నారాయణ (56) పొలం పనులకు వెళ్లి ఇంటికి బైక్‌పై తిరిగి వస్తున్నాడు. గ్రామ సమీపంలోని భీమిరెడ్డి అనే వ్యక్తి పొలం దగ్గర కుక్కలు పరుగెత్తుకుంటూ బైక్‌కు వచ్చి తగిలాయి. దీంతో బైక్‌పై నుంచి అదుపు తప్పి నారాయణ కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడు వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఇంటి పెద్ద దిక్కు చనిపోవటంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతుడి భార్య బుజ్జమ్మ, కుమారుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

భక్తుల ఆందోళన



శిఖరం వద్ద ధర్నా చేస్తున్న మహిళా భక్తులు

శ్రీశైలం: అటవీమార్గంలో ఉన్న ఇష్ట కామేశ్వరి ఆలయ దర్శనానికి ఫారెస్టు అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో భక్తులు ఆందోళనకు దిగారు. మంగళవారం శ్రీశైల మల్లన్న దర్శనానికి భారీగా భక్తులు వచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల్లో కొందరు శ్రీశైల ఆలయానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇష్ట కామేశ్వరి దేవిని దర్శించుకునేందుకు శిఖరం చెక్‌పోస్టు వద్దకు చేరుకున్నారు. అయితే, అటవీ అధికారులు 15 జీపులకు మాత్రమే అనుమతించడంతో మిగతా భక్తులు తీవ్ర నిరాశకు గురయ్యారు. వాహనాల్లో వెళ్లేందుకు తమకు కూడా అనుమతించాలని అక్కడే బైఠాయించారు. అటవీలోకి ఎక్కువ మందికి పంపడానికి వీలుండదని అధికారులు చెప్పినా శాంతించకపోవడంతో వన్‌టౌన్ పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్ది చెప్పారు.

ఐదు జీపులు సీజ్

ఇదిలా ఉంటే ఇష్ట కామేశ్వరి ఆలయానికి వెళ్లే జీపులను వన్ టౌన్ సీఐ ప్రసాద్ రావు శిఖరేశ్వరం చెక్ పోస్టు వద్ద తనిఖీ చేశారు. అందులో సరైన రికార్డులు లేని ఐదు వాహనాలపై కేసులు నమోదు చేసి ఎంవీఐ ఆఫీసుకు తరలించారు.

ప్రతి రైతుకు యూనిక్ ఐడీ నంబరు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రతి రైతుకు గుర్తింపు నెంబరు ఇచ్చే దిశగా కేంద్రం చర్యలు చేపట్టింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఆధార్ తరహాలో రైతులకు యూనిక్ ఐడీ నెంబరు ఇచ్చేందుకు జిల్లాలో ముమ్మరంగా కసరత్తు జరుగుతోంది. రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీ(ఏపీఎఫ్ఆర్) పేరుతో నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లో మండల వ్యవసాయ అధికారి,రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జీలను మ్యాపింగ్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 54 మండలాలు ఉండగా.. ఐదారు మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాల్లో మ్యాపింగ్ చేసే ప్రక్రియ మొదలైంది. ఇంతవరకు రైతులకు ప్రత్యేక గుర్తింపు అనేది లేదు. వెబ్‌ల్యాండ్ డేటానే అందరికి ప్రామాణికం అయింది. ప్రస్తుతం జాతీయ స్థాయిలో ప్రతి రైతుకు ఒక యూనిక్ ఐడీ నెంబరు ఇవ్వడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాల అమలుకు యూనిక్ ఐడీ నెంబర్లే ప్రామాణికం అవుతాయి.

ఆలయాభివృద్ధికి విరాళం

కొత్తపల్లి: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొలనుభారతి దేవి ఆలయాభివృద్ధికి గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన మల్లెల భూసిరెడ్డి కుమారుడు భూసిరెడ్డి మహేశ్వర రెడ్డి లక్షరూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతను నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, ఆలయ ఈఓ రామలింగారెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటనాయుడు ప్రత్యేకంగ అభినందించారు.

నేటి నుంచి 'జేఈఈ మెయిన్'

- మొదటి విడత పరీక్షలు
- పరీక్ష కేంద్రానికి రెండు గంటల ముందే వెళ్లాలి

కర్నూలు(సిటీ): దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు అర్హత కల్పించేందుకు ఉద్దేశించిన జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ -20005 మొదటి సెషన్ పరీక్షలు ఈ నెల 22 నుంచి 30 వరకు జరుగనున్నాయి. 22, 23, 24, 28, 29 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్ట్‌ల్లో పేపర్1(బీఈ, బీటెక్) ప్రవేశ పరీక్షలు జరుగనున్నాయి. ఈ నెల 30న మధ్యాహ్నం పేపర్-2 బీఆర్క్ పరీక్ష జరుగనుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహించనుంది. ఈ పరీక్షలకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. జేఈఈ మెయిన్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏ పరీక్ష కేంద్రం ఉందనే సమాచారంతో సిటీ ఇంటిమేషన్ వివరాలను సైట్‌లో ఉంచినట్లు జేఈఈ అధికారులు తెలిపారు. ఆయా తేదీల వారీగా జరిగే పరీక్షలకు మూడు రోజులు ముందుగా అడ్మిట్ కార్డులను విడుదల చేస్తుంది. బుధ, గురువారాల్లో జరగనున్న పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు సంబంధించిన అడ్మిట్ కార్డులను 18వ తేదీన విడుదల చేశారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి రెండు గంటలు ముందుగానే చేరుకోవాల్సి ఉంది. దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన ఆధార్, పాన్ తదితర ఒరిజినల్ కార్డులు తీసుకెళ్లాల్సి ఉంది.

విశ్వ బ్రాహ్మణులు ఐక్యంగా ముందుకు సాగాలి



గానాల రామమూర్తి జయంతి కార్యక్రమంలో బీసీ నేతలు

కర్నూలు(అర్బన్): విశ్వ బ్రాహ్మణులు ఐకమత్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని బీసీ సంఘాల నేతలు కోరారు. మంగళవారం బ్రహ్మశ్రీ రావుసాహెబ్ పండిత గానాల రామమూర్తి 133వ జయంతి సందర్భంగా ఆయా సంఘాల నాయకులు స్థానిక బీసీ భవన్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. ఆనంద్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షుడు వై. నాగేశ్వరరావుయాదవ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, కులాల ఐక్యవేదిక కన్వీనర్ టి శేషఫణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండిత గానాల రామమూర్తి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఎమ్మెల్సీగా ఉండి విశ్వ బ్రాహ్మణులను బీసీ కులాల్లో చేర్పించిన మహనీయుడన్నారు. ఆయన చేసిన కృషి వల్లే నేడు విశ్వ బ్రాహ్మణులు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు నంది విజయలక్ష్మి, భరత్‌కుమార్, ఆస్పరి శ్రీనివాసులు, బ్రహ్మయ్య ఆచారి, చంద్రశేఖర్ ఆచారి, కుబేరస్వామి, విద్యార్థి నాయకులు రాజేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుల నియామకం



కర్నూలు జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణను అభినందిస్తున్న బీజేపీ నాయకులు



నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధును సన్మానిస్తున్న నాయకులు

కర్నూలు(సెంట్రల్)/నంద్యాల (వ్యవసాయం): బీజేపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులను మంగళవారం ఎన్నుకున్నారు.కర్నూలుకు మంత్రాలయం నియోజకవర్గ కౌతాళానికి చెందిన అక్కమ్మ తోట రామకృష్ణ, నంద్యాలకు పట్టణానికి చెందిన అభిరుచి మధు నియమితులయ్యారు. ఆయా జిల్లాలోని పార్టీ కార్యాలయాల్లో ఈ ప్రక్రియ జరిగింది. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని నూతన అధ్యక్షులు ఈ సందర్భంగా చెప్పారు. అంతకు ముందు వారిని పార్టీ నాయకులు ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు.

ఆల్కాలీస్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం



టీజీ ఆల్కాలీస్ ఫ్యాక్టరీ ఆవరణలో ఎగిసిపడుతున్న మంటలు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గొందిపర్ల గ్రామ సమీపంలో ఉన్న టీజీ ఆల్కాలీస్ ఫ్యాక్టరీ ఆవరణలో మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. లారీ డ్రైవర్ బీడీ తాగుతుండగా నిప్పురవ్వ ఎగిసి లారీలోని కెమికల్‌పై పడటంతో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అగ్ని మాపక వాహనం ద్వారా మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదని ఫ్యాక్టరీ అధికారులు వెల్లడించారు.

గుప్త నిధుల పుకారుపై విచారణ



నాగలదిన్నెలో విచారణ చేస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

నందవరం : నాగలదిన్నె గ్రామంలోని పాడుబడిన ఇంట్లో గుప్త నిధి ఉందని, దానిని వెలికి తీసేందుకు వెళ్లి ఇటీవల బండ రాముడు అనే వ్యక్తి మృతి చెందినట్లు పుకారు షికారు చేసింది. ఈ విషయం అధికారులకు చేరడంతో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. రాముడు ఇంటికెళ్లి ఆరా తీయగా తన భర్త అనారోగ్యంతో చనిపోయాడని భార్య నీలమ్మ వెల్లడించినట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

పాఠశాలకు బీరువాల వితరణ



బీరువాలను అందజేస్తున్న ప్రజాపతిరెడ్డి

నంద్యాల(అర్బన్): రిటైర్డ్ టీచర్ ప్రజాపతిరెడ్డి స్థానిక నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్‌కు రెండు బీరువాలు విరాళమిచ్చారు. అదే పాఠశాలలో పని చేసి ఇటీవల పదవీ విమరణ పొందిన ప్రజాపతిరెడ్డి రూ.30 వేల విలువ చేసే రెండు బీరువాలను మంగళవారం హెచ్‌ఎం చలపతికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, పద్మనాభం, పద్మజ, సునంద, పద్మావతి పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 74 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శశికళారెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఏపీఎస్ఎస్‌డీ ఆధ్వర్యంలో స్థానిక పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 74 మందికి ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ శశికళ తెలిపారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన జాబ్ మేళాలో నాలుగు కంపెనీలు హాజరయ్యాయని, 152 మంది విద్యార్థులు హాజరు కాగా 74 మందిని ఎంపిక చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ పార్వతి, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

26న ఫుట్‌బాల్ బాలుర ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 26న జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్పీజీ క్రీడా మైదానంలో సీనియర్ ఫుట్‌బాల్ బాలుర ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు వినయ్‌సాగర్, సెక్రటరీ ఏ.అనిల్‌కుమార్ మంగళవారం తెలిపారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ఎంపికైన ఫుట్‌బాల్ క్రీడాకారులు కర్నూలులో జరిగే లీగ్ సీనియర్ ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో పాల్గొంటారన్నారు. ఫుట్‌బాల్ ఎంపిక పోటీలకు ఫుట్‌బాల్ కిట్టుతో హాజరు కావాలని తెలిపారు. మరింత సమాచారం కోసం ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వినయ్‌సాగర్ సెల్: 9963636876కు సంప్రదించాలన్నారు.

మహానందీశుడి దంపతులకు కల్యాణోత్సవం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు మంగళవారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, ఆంజనేయ శర్మ, శాంతారాంభట్‌లు స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్త పూజలు చేశారు. పలు ప్రాంతాల భక్తులు కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి స్వామి, అమ్మవారి అనుగ్రహం పొందారు.

కోలుకోలేక యువకుడి మృతి

బనగానపల్లె: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన చాకలి నాగేంద్రప్రసాద్ (26) అనే యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఇతను ఈనెల 13న కడుపునొప్పి తాళలేక పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మంగళవారం ఉదయం ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడి భార్య చాకలి మద్దమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. కాలనీకి చెందిన ముగ్గురు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నామని చెప్పారు. వారి వద్ద నుంచి రూ. 8,900 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకు ని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–సంజామల ఆర్ అండ్‌బీ రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. 108 అంబులెన్స్ సిబ్బంది సమాచారం మేరకు.. సంజామల మండలం ముచ్చలపూరికి చెందిన సుబ్బారెడ్డి సొంత పనుల నిమిత్తం బైక్‌పై కోవెలకుంట్లకు వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఇదే మండలం గిద్దలూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై కోవెలకుంట్ల వైపు వస్తుండగా మండలంలోని గుంజలపాడు సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురూ గాయపడగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సర్కారు దవాఖానాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు నాలుగు నెలలుగా వేతనాలు లేక అల్లాడుతున్నారు. అసలే అంతంత మాత్రం వేతనమని, అది కూడా 4 నెలలుగా పెండింగ్ పెట్టారంటూ గగ్గోలు పెడుతున్నారు. వేతనాలు అందకపోవడంతో అప్పు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– నంద్యాల(న్యూటౌన్)

కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు(ఫైల్)



పనిచేసినా పస్తులే!

- 4 నెలలుగా జీతాలు రాక కాంట్రాక్ట్ కార్మికులు ఇబ్బందులు
- అప్పు చేసి రోజులు గడుపుతున్న వైనం
- నిరసన తెలుపుతున్నా పట్టించుకోని కూటమి ప్రభుత్వం

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మొత్తం 55 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి ఆవరణతోపాటు వార్డులు, మరుగుదొడ్లు, ఆపరేషన్ థియేటర్ వంటి విభాగాల్లో నిత్యం శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఆస్పత్రి సామర్థ్యం పెరిగినా అదే సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. పని పెరిగినా కష్టపడి పనిచేస్తూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్మికులు సేవలందిస్తున్నారు. ఆపరేషన్ థియేటర్లో వచ్చే వ్యర్థాలతో పాటు వివిధ వార్డుల్లో వచ్చే వ్యర్థాలను తొలగించడంలో పారిశుద్ధ్య కార్మికులు కీలకంగా పనిచేస్తుంటారు. రక్తపు వ్యర్థాల తొలగింపులో రోగాల బారిన పడుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లోనే విధుల్లో ఉండాల్సి వస్తుందని, అయినప్పటికీ ఏ నెల వేతనం ఆ నెల ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఆవేదన చెందుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో కార్మికులపై నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం వేతనాలు సక్రమంగా రాకపోవడం తీవ్ర దుమారాన్ని రేపుతోంది. కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో పలు సందర్భాల్లో నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితులు కనిపించడంలేదని నాయకులు చెబుతున్నారు. గతప్రభుత్వ హయాంలో వేతనాలు పెంచగా ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వేతన గండం నెలకొందని వాపోతున్నారు. అంతేకాకుండా కార్మికులకు సంబంధించిన పీఎఫ్ కూడా తమ బ్యాంకు ఖాతాలకు జమకావడం లేదని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నంద్యాల ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు(ఫైల్)

పారిశుద్ధ్య కార్మికులు ఎలా బతకాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం ఇవ్వకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ వేతనానికి విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ వేతనం కూడా ఏ నెల వేతనం ఆ నెలలో ఇవ్వకుండా ఇప్పటికీ 4 నెలలు పెండింగ్ ఉంచడం చాలా దారుణం. వేతనం ఇవ్వకపోతే వారు ఇళ్లు ఎలా గడుపుకోవాలి. అప్పు చేసి వడ్డీలు కట్టాల్సిన పరిస్థితుల్లో కార్మికులు ఉన్నారు. విధి నిర్వహణలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు నంద్యాల ప్రభుత్వానికి ఎన్నో అవార్డులు తెచ్చిపెట్టాయి. అటువంటి కార్మికులను నిర్లక్ష్యం చేయడం తగదు. – బాలవెంకట్, సీఐటీయూ కార్యదర్శి, నంద్యాల

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



పూజలందుకున్న స్వామి, అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్ రామాలయంలో లక్ష్మీవెంకటేశ్వరస్వామికి మంగళవారం వేదపండితులు అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. తెల్లవారుజామునే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. 108 బంగారు పుష్పాలచే స్వామి వారికి అష్టోత్తర నామావళి నిర్వహించారు. మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వేదపండితుడు శ్రీకాంత్‌శర్మ, సూరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు. కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో కాళికాంబదేవికి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించి ఒడి బియ్యం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. మహామంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విరాళాలు సేకరిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం



మాట్లాడుతున్న ఇస్కాన్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): ఇస్కాన్ పేరుతో మందిర నిర్మాణం కోసం విరాళాలు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇస్కాన్ పర్యవేక్షకులు రఘువంశ రాందాస ప్రభు భక్తులకు తెలియజేశారు. ఎస్‌బీఐ కాలనీలోని ఇస్కాన్ ప్రచార మందిరంలో మంగళవారం వారు మాట్లాడుతూ నంద్యాలలో తాము ఇస్కాన్ మందిరం నిర్మించడం కానీ, విరాళాలు సేకరించడం కానీ చేయడం లేదన్నారు. కొందరు వ్యక్తులు ఇస్కాన్ భక్తుల వేషధారణలో మందిర నిర్మాణం చేస్తున్నామంటూ విరాళాలను సేకరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటి వారి పట్ల భక్తులు జాగ్రత్త వహించాలని, ఎవరైనా ఇస్కాన్ పేరుతో భక్తుల ఇంటి వద్దకు వస్తే తమకు(8977488848) తెలియజేయాలని సూచించారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గోస్పాడు: మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అమానుల్లా తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు ప్రత్యేకంగా 6 ఏళ్లలోపు పిల్లలకు ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు ఉచితంగా, మిగతావారికి రూ.వంద సర్వీసు ఫీజుతో బయోమెట్రిక్ అప్డేట్ చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 21, 22 తేదీలలో దీబగుంట్ల, నెహ్రూనగర్, ఎస్.నాగులవరం, కానాలపల్లె సచివాలయాల పరిధిలోని వారికి దీబగుంట్లలో, 23, 24న యాళ్లూరు, ఎం.క్రిష్టాపురం గ్రామ సచివాలయాల పరిధిలోని వారికి యాళ్లూరులో, 27న సాంబవరంలో, 28న రాయపాడు, తేళ్లపురి, పసురపాడు, గోస్పాడు, ఒంటివెలగల గ్రామ సచివాలయాల పరిధిలోని వారికి రాయపాడులో, 29న జిల్లెలల్లో, 30న జూలేపల్లె, ఎం.చింతకుంట్ల గ్రామ సచివాలయాల పరిధిలోని వారికి జూలేపల్లెలో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



జీవామృతం తయారీ విధానాన్ని చూపుతున్న ఏఓ



ఎల్లావత్తులలో మినుము పంటను పరిశీలిస్తున్న ఏఓ

దొర్నిపాడు: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని మండల వ్యవసాయాధికారి ప్రమీల సూచించారు. మంగళవారం మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో స్థానిక రైతు సేవాకేంద్రం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు జీవామృతం, ఘనామృతం తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం పంటల సాగుకు రైతులు భారీగా రసాయన ఎరువులను వినియోగిస్తున్నారని, దీంతో పెట్టుబడుల అమాంతం పెరుగుతున్నాయన్నారు. ఇటువంటి సమయంలో ప్రకృతి విపత్తులు సంభవిస్తే కోలుకోలేరన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం సాగుచేసేందుకు ముందుకు రావాలని సూచించారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి

రుద్రవరం: యాజమాన్య పద్ధతులు పాటించి తెగుళ్ల నివారించుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగేంద్ర ప్రసాద్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని కోటకొండ, ఎల్లావత్తుల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన ఆయా గ్రామాల రైతులతో కలిసి వారు సాగు చేసిన, వరి, మినుము తదితర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు ఇచ్చారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి తాము సిఫారసు చేసిన పురుగు మందులను వినియోగించాలన్నారు. మినుముకు పల్లాకు తెగులు నివారణకు విత్తన శుద్ధి పాటించడంతో పాటు పొలంలో విత్తు విత్తే సమయంలో చట్టూ నాలుగు సాల్లు జొన్న విత్తుకోవడం, తెల్లదోమ నివారణకు పసుపు రంగు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. పొలాల్లో అధిక రసాయన ఎరువులు వాడటంతో పొలాల్లో భూ సారం దెబ్బతింటుందని, సేంద్రీయ, జీవన ఎరువులు వాడి భూసారం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం నుంచి వచ్చిన వ్యవసాయాధికారి ప్రభావతమ్మ, విస్తరణ అధికారులు రాజు, పహిమ తబస్సుం, వీఏఏలు రేవతి, రేష్మ, శివక్రిష్ణ ఉన్నారు.

ముగిసిన వేలంపాటలు

కొత్తపల్లి: మండలంలోని కొలనుభారతిదేవి ఆలయంలో మంగళవారం ఈఓ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో దేవదాయ శాఖ తనిఖీ అధికారి హరిచంద్రరెడ్డి పర్యవేక్షణలో దుకాణాల ఏర్పాటుకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఫొటోల విక్రయ హక్కులకు రూ.19 వేలు, గాజుల అంగడికి రూ.6 వేలు, బొమ్మలు అమ్ముకొనేందుకు రూ.6 వేలు, కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌కు రూ.24,500, బెల్లం చెరుకులు, కలింగర పండ్లకు రూ.9 వేలు, అమ్మవారి ఫొటోలకు రూ.15,000లకు పాటదారులు దక్కించుకున్నారు. గత ఏడాది అన్ని అంగళ్లకు గాను రూ.74,500 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.79,500 వచ్చినట్లు అధికారులు తెలిపారు. పాటదారులు 2026 వసంత పంచమి వరకు వ్యాపారాలు నిర్వహించుకునే హక్కు ఉంటుందన్నారు. అలాగే 10 నెలల కాల వ్యవధిలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.3,21,821 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటనాయుడు, ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ పాల్గొన్నారు.



ఆలయ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

సారా అమ్మితే కఠిన చర్యలు

డోన్ రూరల్: నాటుసారా అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి అన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించామని తెలిపారు. బేతంచెర్ల మండలం గూటుపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి బాలరాజు, రంగాపురం గ్రామానికి చెందిన ఉడుగళ్ల రామమద్దయ్యలను అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 140 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగూ 1,600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా సారా తయారు చేసినా విక్రయించినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సీఐ ఎస్.కృష్ణ, ఎస్ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్, మధుసుదన్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్స్ లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి, ఉమాకాంతరెడ్డి, జయచంద్ర, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న సారాను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మొక్కజొన్న పంట పరిశీలన

నంద్యాల(అర్బన్): నాసిరకం విత్తనం సాగుతో కండెల సైజు తగ్గడంతో తీవ్రంగా నష్టపోయిన నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామ రైతుల పొలాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటను ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తల బృందం మంగళవారం పరిశీలించింది. ఈనెల 18న ×ముంచిన నకిలీ విత్తనాలు× శీర్షికకు ×సాక్షి×లో ప్రచురితమైన కథనానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు స్పందించారు. గ్రామంలో సీఎంహెచ్–157 రకం సాగు చేసిన విత్తనంతో నష్టపోయిన రైతులు సంజీవరెడ్డి, మోహన్‌రెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డిలతో కలిసి శాస్త్రవేత్తలు పంట సాగును పరిశీలించారు. పంట సాగు వివరాలను రైతుల ద్వారా తెలుసుకొని శాంపిల్స్‌ను సేకరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు శివ రామకృష్ణ, వెంకటరమణ, ఇషా పర్వీన్ మాట్లాడుతూ పంట దిగుబడులకు కారణాలను ఆర్ఏఆర్ఎస్‌లో ప్రయోగాల ద్వారా తెలుసుకొని రైతులకు వివరిస్తామన్నారు. వీరి వెంట ఏడీఏ రాజశేఖర్, ఏఓ ప్రసాదరావు ఉన్నారు.



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి



గొర్రెలకు నట్టల నివారణ మందులను వేస్తున్న పశువైద్యులు

దొర్నిపాడు: పశువుల ఆరోగ్యం పట్ల పాడిపెంపకందారులు జాగ్రత్తగా ఉండాలని ఆళ్లగడ్డ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కొండారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో పశువైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దోమలు అధికంగా ఉన్నాయని, రాత్రివేళల్లో పశువులు ఆరోగ్యంగా ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం 16 మోతు గేదెలకు చికిత్స చేశారు. ఆరు గేదెలకు కృత్రిమ గర్భధారణ సూదులు వేశారు. 369 గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీఆర్ పుల్లయ్య, జేవీఓ రమణయ్య పాల్గొన్నారు.

● చాగలమర్రి: మండలంలోని చిన్నబోధనం, మద్దూరు గ్రామాల్లో పశు వైద్య ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పశు వైద్యాధికారులు సాయిబాబా, దీప కుమారీ పాల్గొని పాడి పశువులకు, మేకలకు, గొర్రెలకు, ఎద్దులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వీఎల్‌ఓలు మురళీకృష్ణ, జమాల్‌వలి, గోపాలమిత్ర వీరయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

● ఉయ్యాలవాడ: పశువులకు సోకే వ్యాధులపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారులు రవీంద్రనాథరెడ్డి, నాగశైలజ సూచించారు. మంగళవారం హరివరం, ఉయ్యాలవాడలో పశు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పశువులకు గర్భకోశ చికిత్సలు, నట్టల నివారణ మందుల పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి శాస్త్రీయ యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల వైద్య శిబిరాలలో 1,100 పశువులకు, 750 మేకలు, గొర్రెలకు చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు.

జీఓ నం.53 రద్దు పట్ల హర్షం

నంద్యాల(అర్బన్): జీఓ నం.53ను రద్దు చేస్తూ హైకోర్టు తీసుకున్న నిర్ణయం పట్ల మాల మహాసభ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వారు మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి దేవాంతకుడితో కలిసి మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

జిల్లా స్థాయి ఫుట్ బాల్ పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పురపాలక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నంది బాలోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఫుట్‌బాల్ సెవెన్‌ఏ సైడ్ ఫుట్‌బాల్ పోటీలను నంద్యాల యూనియన్ బ్యాంక్ మేనేజర్ అనుదీప్, జన విజ్ఞాన వేదిక సభ్యులు మహేశ్వరి ప్రారంభించారు. కార్యక్రమంలో నంది బాలోత్సవ్ కార్యదర్శి చైతన్య సిద్ధు, పీఈటీ రవి కుమార్, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీ శివకుమార్, ఎన్‌సీసీ ఆఫీసర్ రవికుమార్ పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై సర్వే

శిరివెళ్ల: మండలంలో కుష్టు వ్యాధిపై సర్వే మొదలయిందని స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి దివ్య తెలిపారు. గోవిందపల్లెలో జరుగుతున్న సర్వేను ఆమె తనిఖీ చేశారు. ఈ నెల 20 నుంచి సర్వే ప్రారంభమైందని వచ్చే నెల 2వ తేదీ వరకు జరుగుతుందని చెప్పారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేస్తారన్నారన్నారు. అనుమానితులను గుర్తించి వారికి తగిన చికిత్సలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రారంభం

శిరివెళ్ల: మండలంలో ఉపాధి పథకం అమలుపై సామాజిక తనిఖీ ప్రారంభమైందని ఏపీఓ రామసుబ్బయ్య మంగళవారం తెలిపారు. 2023–24 సంవత్సరంలో మండలంలో రూ.9.84 కోట్ల విలువైన వివిధ పనులు జరిగాయన్నారు. అందులో కూలీలకు రూ.6.99 కోట్ల మేర వేతనాలు చెల్లించినట్లు చెప్పారు. తనిఖీలపై గ్రామ సభలు జరుగుతాయని, అనంతరం మండల స్థాయి ప్రజా వేదిక ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

గ్యాస్ సిలిండర్లు సీజ్

పాములపాడు: స్థానిక హోటళ్లలో 7 సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసినట్లు ఆర్ఐ ఖాజాబీ మంగళవారం తెలిపారు. ఈనెల 20న రాత్రి విజిలెన్స్ అధికారులు విశ్వనాథ్, సిద్దయ్య తనిఖీలు నిర్వహించగా 3 హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను జప్తు చేసి తమకు స్వాధీనం చేశారన్నారు. హోటళ్ల యజమానులపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

జాతీయ రహదారుల భూసేకరణను పూర్తి చేయండి

నంద్యాల: రాష్ట్రంలోని వివిధ జాతీయ రహదారుల ప్రాజెక్టుల నిర్మాణం, విస్తరణకు అవసరమైన భూసేకరణను పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జేసీలతో పాటు రెవెన్యూ, అటవీ, టీఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ భూసేకరణకు సంబంధించి నిబంధనల ప్రకారం రైతులకు పరిహారం అందించాలని, భూసేకరణ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి ఆయా నిర్మాణ సంస్థలకు ఇవ్వాలని స్పష్టం చేశారు. రెవెన్యూ, అటవీ, టీఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ మినిస్ట్రీ ఆఫ్ అధికారులు సమన్వయంతో పనిచేసి సకాలంలో పలు సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పాల్గొన్నారు.

వాల్టా అనుమతి లేని బోర్లను సీజ్ చేయాలి



ఫిర్యాదు పత్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుభద్ర

దొర్నిపాడు: వాల్టా చట్టం అనుమతి లేని బోర్లను సీజ్ చేయాలని సొసైటీ మాజీ ప్రెసిడెంట్ భూమా చెంచిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ప్రెసిడెంట్ బత్తుల నాగేశ్వరరావు, వైస్‌ప్రెసిడెంట్ కాకర్ల చంద్ర మోహన్‌నాయుడు డిమాండ్ చేశారు. చాకరాజువేముల గ్రామస్తులతో కలిసి వారు తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీఓ సావిత్రి, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ సుప్రియలకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో పూసల తిమ్మరాజు, పూసల నాగరాజు వాల్టా చట్టం అనుమతి లేకుండా బోరు వేసుకుని మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బోరు నుంచి బోరుకు 250 మీటర్ల దూరం ఉండాలనే నిబంధనను వీరు పాటించలేదన్నారు. పంచాయతీ బోరుకు కేవలం 150 మీటర్లే ఉందని, దీంతో వేసవిలో తాగునీటి సమస్య ఎదురయ్యే ప్రమాదం ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు తులసీరాముడు బోరును వాల్టా చట్టం అనుమతి లేదని అధికారులు సీజ్ చేసి, నోటీసులు జారీ చేశారన్నారు. వాల్టా చట్టం అనుమతులు లేని మిగతా బోర్లను కూడా సీజ్ చేయాలన్నారు.

● నమ్మండి.. సీ‘ఛీ’ రోడ్డే!



ఉయ్యాలవాడ మండలం పుచ్చకాయలపల్లె గ్రామంలో సీసీ రోడ్డు బురదకుంటను తలపిస్తోంది. గ్రామంలోని దర్గా నుంచి సంజీవరాయుడి ఆలయం వరకు సిమెంట్ రోడ్డు వేశారు. అయితే మురుగు కాలువలు లేకపోవడంతో గ్రామంలోని కుళాయిల వృథా నీరంతా రహదారిపై ప్రవహిస్తోంది. వృథా నీరు నిత్యం ప్రవహిస్తూ ఉండడంతో మట్టి చేరుకుని బురదమయంగా మారింది. ఆలయానికి వెళ్లే భక్తులు, గ్రామంలోకి ద్విచక్రవాహనాలపై వెళ్లే ప్రయాణికులు, పాదచారులు బురదలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డుపై పేరుకుపోయిన బురదను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. – ఉయ్యాలవాడ